


# -31-

## అమెరి"కోడి కత్తి" కథ

హమ్మయ్య, ఇంటికొచ్చేశాం అనుకుని సోఫాలో చతికిల పడి, పడలేక వెన్నెముక కీ సోఫాకీ మధ్య ఒక తర(ల?)గడా అనగా దిండు తెప్పించుకుని సరియిన విధంగా అమర్చుకుని కూచుని .....అవును అదే ఆ రిమోట్ తీసుకున్నాను. కొన్నాళ్ళు ఆ రిమోట్ ఎలా పని చేస్తుందో నిర్ఘుం గానే కనిపెట్టదల్చుకున్నాను.

'హమ్మయ్య, మా వైటు గారు నీకు నీటుగా నే ఉన్నాడుగా. నీకు నచ్చాడు కదా. ఇక పరవాలేదు." అంది మా పెద్దమ్మాయి రెండు వారాల క్రితం.

'హమ్మయ్య, మొత్తానికి శలవు ఇచ్చింది మా బాసు గాడిద లేకపోతే చంపేద్దును" అంది మా క్వీన్ విక్టోరియా అదే రెండు వారాల క్రితం, ఎదురుగా అమాయకంగా కూచున్న నాకేసి తన ఎడం చేతి చూపుడు వేలు గంటకి 75 మైళ్ళ స్పీదులో ఆడిస్తూ..మా టెక్సస్ స్పీడ్ లిమిట్ దాటకుండా జాగ్రత్త పడుతూ... అయితే నేను ఎంత కుతూహలం చూపించినా, ఆవిడకి కందా బచ్చలి కూర చేసి పెట్టీ, తను ఎన్ని టన్నులు తినేసినా ఆసక్తి మరియు జీర్ణశక్తీ ఏ మాత్రం తగ్గని కేడ్ బరీ చాక్లెట్లు కావలిసినన్ని ఇస్తాను అని ఎంత ఆశ పెట్టినా తన చైనీసు బాస్ ని ఎలా చంపదల్చుకుందో ఆ వివరాలు మటుకు దాచిపెట్టింది.

"హమ్మయ్య, విమానం టికెట్లు చవకగానే దొరికాయి, నానా" అన్నాడు బోస్టన్ లో ఉండే మా పండిత పుత్రుడు. అంటే ఏదో పండితుడిని అని చెప్పేసుకోడానికి అలా అనడం లేదు కానీ వాడి కున్న అర్హతలు ఒకే మాటలో చెప్పడానికి అలా చెప్తే అందరికీ అర్థం అవుతుంది కదా! అన్నట్టు, ఇక్కడ నానా అంటే నాన్నా అని వత్తు మీరే పెట్టుకోవాలి. వాడికి రాదు. ఎంతయినా ఈ తరం తెలుగు వాడు కదా! ఇక్కడ ఉన్న వత్తు కూడా మీరే తీసేసుకోవాలి. చెప్పానుగా నేను పండితుడిని కాదూ అని.

"హమ్మయ్య, ఈ వారాంతం కాల్ లో ఉండకుండా ఏర్పాటు చేసుకో గలిగాను, బావ గారూ" అని ఫోన్ చేశాడు డాలస్ లో ఉండే ప్రముఖ హృద్రోగ నిపుణుడు...అనగా కార్డియాలజిస్ట్ అయిన నా పెద్ద బావ మరిది.

"హమ్మయ్యా, అందరూ ఒప్పేసుకున్నారు. దానికి వేరే గది ఉంటుంది. ఇక పరవా లేదు" అంది మా రెండో అమ్మాయి. ఆ పసిదానితో కలిపీ ఈ వారాంతం లో మా ఇంట్లో ఉండేవాళ్ళు ఆ ఆరుగురు అయితే మా ఇంట్లో ఉన్నవి ఐయిదే పడక గదులు కాబట్టి దానికి లెక్క సరిపోలేదు మరి! ఈ రోజుల్లో దానికున్న అతి పెద్ద ఈతి బాధ...తన ఏడాదిన్నర కూతురికి..అనగా మా ఏకైక మనవరాలికి రాత్రి నిద్రపోడానికి ప్రత్యేకంగా ఒక గది ఇస్తారా, ఇవ్వరా అనేది మాత్రమే. పసిపిల్లలు ఎప్పుడూ వేరే గదిలోనే పడుకోవాలీ, తల్లిదండ్రుల గదిలో పడుకోకూడదు అని ఎక్కడో చదివిందట మా ప్రాణాలకి. పిల్లల్ని ఎలా పెంచాలీ అనే అంశానికి గూగుల్ వారి లక్షల లంకెలు మా అమ్మాయి లక్షసార్లు చూసి తన కూతురిని పెంచుతోంది. అదీ సంగతి. నా చిన్నప్పుడు నేను కూడా ఆ పద్ధతే పాటించి నా సొంత "గది" లోనే అంటే మా మామిడి చెట్టు క్రిందనే నవారు మంచం మీదనే పడుకునే వాడిని. అంచేత ఇదేం కొత్త సిద్ధాంతం కానే కాదు.

ఇలా మా కుటుంబం అంతా మూకుమ్మడిగా మా ఇంటికి వచ్చి, "హమ్మయ్య" అని ఒకే పాట పాడుకోడానికి కారణం ఆ నలుగురూ. అందులో ముగ్గురు రోగాలు నయం చేసే వైద్యులే. ఒకాయన న్యూరాలజిస్ట్, మరొకాయన, కారియాలజిస్ట్, మూడో ఆయన ఆ ఇద్దరిమాటా విని "అమెరికోడి కత్తి" తో గాట్లు వేసే న్యూరో సర్జన్. నాలుగో వాడిని అయిన నేను పేరుకే పేరు పక్కన పెట్టుకోడానికి డబ్బుల్లేని ఇంజనీరింగ్ లో డాక్టరేట్ ఉన్నబీద వాడిని.

అసలు ఇప్పుడు జరిగిన ఈ తతంగం పూర్వ రంగం అంతా ఏడాది క్రితమే మొదలయింది. ఒక రోజు గట్టిగా ఒక యాభై అడుగులు వెయ్యగానే మోకాళ్ళ క్రిందఉన్న కాళ్ళ కండరాల నొప్పులు రాగానే "అమృతాంజనం రాసుకో" అనేసి మా క్వీన్ విక్టోరియా అర్ధరాత్రి తన పనికి వెళ్లి పోయింది.

నాకేదో అనుమానం వచ్చి వెంటనే తనకి ఫోన్ చేసి" అమృతాంజనం తల నొప్పి కి కదా" అని అమాయకంగా అడిగాను.

"అవునోయ్ మొగుడు గారూ అందుకే. నీ తలకాయ ఉన్నది మోకాళ్ళ లోనే కదా" అని పక పకా నవ్వేసి ఫోన్ పెట్టేసింది.

"హారినీ, ఇవాళ కూడా దొరికిపోయాం" అని మూసుకుని అప్పుడప్పుడు మాత్రమే చేసే వ్యాయయం మళ్ళీ మొదలుపెట్టి, మందుల కొట్లో దొరికే ఐదారు రకాల చమురు పదార్ధాలూ, మాత్రలూ వేసుకున్నా వందల కొద్దీ డాలర్ల ఖర్చూ, బకెట్ల కొద్దీ చెమటలూ తప్ప ఏం సుఖం లేదు. వెన్నెముక అరిగిపోయిందో మరేమిటో కానీ అక్కడి ఆఖరి భాగంలో ఉన్న రెండు దగుల్బాజీ వెన్ను పూసలు పక్కనే తనపని చేసుకుంటూ హాయిగా అన్ని నరాలనీ మెదడుకి మోసుకుపోయే పెద్ద నరం గారిని చీటికీ మాటికీ నొక్కుతూ ఉండడం వలననే నడుం, కాళ్ళు, భుజాలు ఇలా ఎక్కడ పడితే అక్కడ నొప్పి రావడానికి కారణం అని ఆ ముగ్గురు డాక్టర్లు తేల్చి చెప్పారు. దానికి ఉన్న మూడంచెల చికిత్సల లో ఫిజికల్ థెరపీ, మూడు విడతలలో ఇంజెక్షన్లు చేయించుకున్నా నా శరీరానికి ఉపశమనం కలగ లేదు. ఇక ఆ దగుల్బాజీ వెన్నెపూసలు నరాల జోలికి వెళ్ళకుండా అవసరం అయిన న్యూరో సర్జన్ ని మా పెద్దమ్మాయి ఎంపిక చేసేసింది. ఆ 'కోడి కత్తి" డాక్టర్ పేరు చూడడానికీ, నిజంగానూ డాక్టర్ వైటే...జేమ్స్ బ్రాడ్లీ వైట్ గారు. ఆయనా, మా పెద్దమ్మాయీ ఒకే హాస్పటిల్ లో పనిచేస్తారు. ఆ వైటు గారు కత్తీకఠారులూ పట్టుకునే న్యూరోసర్జన్ అయితే అంత రంగు లేని మా పెద్దమ్మాయి పక్క గదిలో పక్కన నిలబడి ఏ కోత విధించాలో చెప్పే కార్డియాక్ నర్సు. వాళ్ళిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడేసుకుంటూ నా ఎమ్మారై ఎమ్మారైలు ఒకటికి పది సార్లు పైకీ, కిందకీ, తలక్రిందులు గానూ చూసేసి "భలే బావుంది. ఇది చిన్న కోడి కత్తి కేసే కదా. చేసేద్దాం" అని క్రిందటి వారం ముహూర్తం పెట్టారు.

నాకైతే ఆ ఎమ్మారై చూడగానే అది అసలు నా పవిత్ర భారత దేశ శరీరంలో ఒక భాగం అనే భావనే కలగ లేదు సరికదా, మనం చంద్రయాన్ పంపించిన చంద్రుడి దక్షిణ ధృవం ఫోటోలా కనపడింది. నేను ఆ పాయింటు లేవదీస్తూ, సర్జరీకి నాడు వర్జ్యం ఉందేమో, దుర్ముహూర్తం ఏమో, టీవీ లో జాతకాలు అడక్కపోయినా క్రెడిట్ కార్డులు తీసుకుని ముహూర్తాలు పెట్టే పురోహితుడి గారిని అడుగుదామా అని తెలుగులో గుర్రు గుర్రు మంటున్న నా మాట ఒక్కరు కూడా వినిపించుకోలేదు. ఈ సర్జరీ అంతా మా ఇంటికి గంటన్నర దూరంలో ..సుమారు 100 మైళ్ళ దూరం లో ఉన్న బ్రయన్/కాలేజ్ స్టేషన్ అనే చిన్న ఊళ్ళో ఉన్న పెద్ద హాస్పిటల్ లో..అంటే వాళ్ళిద్దరూ పని చేసే ఆసుపత్రిలోనే గత వారం చెయ్యడానికి నిర్ణయం అయిపోయింది. సర్జరీ అయ్యాక సరదాగా ఆ హాస్పిటల్ లోనే ఒక రోజు ఉండి, నలుగురు నరసమ్మాయిలూ, ఒక మగ నర్సుడూ మొదలైన వారిని నా గుండె పోటు, వత్తిడీ, ఆక్సిజన్ సప్లై, వగైరాల తో అందరినీ సంతృప్తి పరచి మొన్న హ్యూస్టన్ లో మా ఇంటికి వచ్చేశాను. అదే లెండి..మనం రాలేదు. వాళ్ళే తీసుకొచ్చారు.

తీరా ఆ వైటు గారికి "బాగా చేశావయ్యా " అని చెబ్దాం అనుకుంటే ఆ కుర్రాడు నాకు మత్తు మందు ఇచ్చే ముందు కానీ, అంతా అయిపోయాక నేను మళ్ళీ మత్తు జోకులు వెయ్యడం మొదలు పట్టాక కానీ నాకు కనపడనే లేదు. మత్తులో ఉన్నప్పుడు వచ్చాడో లేదో తెలియదు. అందుకే ఆయన కి మొహం చెల్లక నన్ను చూడడానికి రాలేదు లేదు అనుకుంటాను. అలా ఆపరేషన్ ముందూ, తరవాతా పేషెంట్ కి కనపడక పోవడం అమెరికా ఆచారం ట. నా బొంద ఆచారం. అదే మా మామ గారు ఇక్ష్వాకుకుల కాలం లో చేసిన చిన్న సర్జరీ కి ఆయన కాలం చేసి పదేళ్ళయినా ఇప్పటికీ మా ఇంటికి ప్రతీ పెద్ద పండగ నాడూ బెల్లం దిమ్మలు, వేసవి కాలంలో బంగిన పల్లి మామిడి పళ్లూ వస్తూనే ఉంటాయి ఆ రోగి గారి మనవల దగ్గర నుంచి. ఆయన కూడా పోయి చాలా ఏళ్లే అయింది మరి.! మొత్తానికి నాకు వచ్చిన లంబర్ స్టెనోసిస్ అని వినడానికి మహా బావున్న అసౌకర్యానికి అందరూ కలిసి మంగళం పాడారు అనే అనుకుంటున్నాను. పూర్తిగా నయం అవడానికి, మా మనవరాలి లాగా బుడి, బుడి అడుగులు పరవా లేదు కానీ మహేష్ బాబు లా నడవడానికి రెండు, మూడు వారాలు పట్టవచ్చునట. ఆ తరవాత ఇక చూద్దాం..

COMMENTS